క్లుప్తంగా

యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు వాక్‌థాన్



లబ్బీపేట(విజయవాడతూర్పు): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సోమవారం వాక్‌థాన్ నిర్వహించింది. బృందావనకాలనీలో ఎ కన్వెన్షన్ సెంటర్ నుంచి ఎంజీ రోడ్డు వరకూ నిర్వహించిన ఈ వాక్‌థాన్‌లో 200 మంది బ్యాంక్ ఉద్యోగులు, కస్టమర్లు పాల్గొన్నారు. మహిళా ఉద్యోగులను కేరీర్ మార్గంలో మరింత గొప్ప బాధ్యతలు చేపట్టేలా ప్రోత్సహించేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆ బ్యాంక్ డెప్యూటీ జోనల్ హెడ్ ఎ. శారదమూర్తి అన్నారు. అంతేకాక ముద్ర, స్టాండ్ అఫ్ ఇండియా, సీజీటీఎంఎస్ఇ వంటి విభిన్న పథకాలకు రుణాలను అందించడం ద్వారా సమాజంలోని మహిళలను వివిధ వ్యాపార వెంచర్‌లను చేపట్టేలా ప్రోత్సహించడంలో తమ బ్యాంక్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. బ్యాంక్ అత్యుత్తమ స్కీమ్ యూనియర్ నారీ శక్తిని ప్రారంభించినట్లు తెలిపారు. ఇందులో మహిళా పారిశ్రామిక వేత్తలకు రూ.2 కోట్లు వరకూ కొలేటరల్ లేని ఉచిత రుణాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. మరో డెప్యూటీ జోనల్‌హెడ్ మురళీపార్థసారథి మాట్లాడుతూ లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడంలో, జీవితంలోని అన్ని రంగాల్లో మహిళలను చేర్చే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. ఈ వాక్‌థాన్‌లో రీజనల్‌హెడ్ ఎం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీఎస్ నిబంధనలపై అవగాహన



భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక ఐరన్ యార్డ్‌లోగల ఐరన్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో సోమవారం టీడీఎస్ నిబంధనలపై వ్యాపారులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆదాయపు పన్ను శాఖ అధికారి కెఎస్ఎన్ రాము మాట్లాడుతూ టీడీఎస్ నియమ నిబంధనలపై సరైన అవగాహన లేకపోవడం వలన పన్ను మినహాయింపుదారులు వివిధ డిఫాల్ట్‌లకు ప్పాడుతున్నారని తెలిపారు. ఫలితంగా టీడీఎస్ రిటర్న్‌ల ప్రాసెసింగ్‌పై అనవసరమైన డిమాండ్లు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. పర్యవసానంగా జరిమానాలు, చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇటువంటి చర్యలను నివారించేందుకు ప్రతి వ్యాపారస్తుడు టీడీఎస్ నిబంధనల గురించి తప్పనిసరిగా తెలుసుకుని తీరాలన్నారు. టీడీఎస్ విషయంలో ఎటువంటి అనుమానం ఉన్నా తమను సంప్రదిస్తే సహకరిస్తామని చెప్పారు. సదస్సుకు హాజరైన అసోసియేషన్ సభ్యులు తమ సందేహాల గురించి అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ గుర్రం రమణయ్య, సెక్రటరీ కొనకళ్ల సూర్య శంకర్, ఆడిటర్ రాఘవులు పాల్గొన్నారు.

ఎన్టీటీపీఎస్ పురోభివృద్ధికి సహకరించండి



ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో ఉద్యోగుల అసోసియేషన్‌లు, వాటి సభ్యులు సంస్థ పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ నవీన్ గౌతమ్ అన్నారు. ఏపీఎస్ఈబీ ఇంజినీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం సీఈని కలిసి ఆక్సిజన్ మొక్క అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులను సీఈ అభినందించారు. భవిష్యత్‌లో ఇంజినర్ల సమస్యల పరిష్కారంలో చొరవ చూపి సంస్థకు పేరు తీసుకురావాలన్నారు. బ్రాంచి కార్యదర్శి కేవీఆర్ చక్రపాణి, కోశాధికారి వెంకటరావు, జ్ఞానేశ్వరరావు, మధుబాబు, రవి, వెంకట రమణ, ప్రశాంతి పాల్గొన్నారు.

అన్న ప్రసాద వితరణలో ఈవో తనిఖీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో అన్న ప్రసాద వితరణ విభాగాన్ని ఈవో కెఎస్.రామారావు సోమవారం తనిఖీలు నిర్వహించారు. మహా మండపం రెండో అంతస్తుకు చేరుకున్న ఈవో రామారావు అన్న ప్రసాద వితరణను పరిశీలించారు. భక్తులతో రామారావు మాట్లాడారు. అన్న ప్రసాద నాణ్యత, కూరలు, సిబ్బంది వడ్డించే విధానంపై ఆరా తీశారు. భక్తుల పట్ల మర్యాద పూర్వకంగా మెలగాలని సిబ్బందికి సూచించారు. షెడ్డు నెం :1, 2 ను తనిఖీ చేసి భక్తులు దేవస్థానానికి అందిస్తున్న విరాళాల గురించి తెలుసుకున్నారు. భక్తులు అమ్మవారికి సమర్పించే విరాళాలకు తగిన రశీదులను ఇవ్వాలని సూచించారు. ఈవో రామారావు అన్న ప్రసాద వితరణ విభాగాన్ని తనిఖీ చేస్తారనే సమాచారం ముందుగానే అక్కడి సిబ్బంది లీకయ్యినట్లు సమాచారం. ఈవో రెండో అంతస్తుకు చేరుకునే సరికి సిబ్బంది ఎదురు చూస్తూ కనిపించారు.

ఆహ్లాదం... ఆనందం

- రూ. కోటితో ఇండోర్ స్టేడియం
- రూ. 90 లక్షలతో స్విమ్మింగ్ పూల్
- రూ. 1.50 కోట్లతో కేఎల్‌రావు పార్కు అభివృద్ధి
- పశ్చిమానికే తలమానికంగా థీమ్ పార్కు



కేఎల్‌రావు పార్కు ప్రవేశ ద్వారం

ఇది కదా.. అభివృద్ధి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రతి ఒక్కరికీ ఆహ్లాదం అందించేందుకు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నగర పాలక సంస్థ ద్వారా కోట్లాది రూపాయలు వెచ్చించి పార్కులు అభివృద్ధి చేసింది. కేవలం పార్కులే కాకుండా ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్స్ అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. పశ్చిమ నియోజక వర్గానికే తలమానికంగా ఉన్న కేఎల్‌రావు పార్కు అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేయడంతో పాటు క్రీడాకారుల కోసం ఇండోర్ స్టేడియం, చిన్నారుల కోసం చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం ఉట్టి పడేలా స్విమ్మింగ్ పూల్ నిర్మాణం చేపట్టింది. స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు జాతీయ స్థాయిలో రాణిస్తూ విజయవాడ పేరు ప్రఖ్యాతలను దేశనలుమూలలా విస్తరింపచేస్తున్నారు.


రూ. 90 లక్షలతో కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్

పశ్చిమ నియోజక వర్గ ప్రజలకే కాకుండా ఇబ్రహీంపట్నం, సింగ్‌నగర్ ప్రాంతవాసులకు అందుబాటులో ఉన్న కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్ అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 2021 ఫిబ్రవరి 8వ తేదీన రూ. 90 లక్షల అంచనాలతో స్విమ్మింగ్ పూల్ అభివృద్ధికి పునాది రాయి పడింది. స్విమ్మింగ్ పూల్‌తో పాటు విద్యార్థులు దుస్తులు మార్చుకునేందుకు గదలు, కోచ్ కార్యాలయం, టాయిలెట్స్‌తో పాటుగా స్విమ్మింగ్‌పూల్ పరిసరాల్లో ఆహ్లాదకర వాతావరణం వెల్లివిరిసేలా పనులు పూర్తి చేశారు. 2022 ఆగస్టు 16వ తేదీన స్విమ్మింగ్ పూల్‌ను అప్పటి పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చేతుల మీదగా ప్రారంభించారు.

రూ. కోటితో ఇండోర్ స్టేడియం

కేఎల్‌రావు పార్కులోని స్థలంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపట్టారు. రూ. కోటి వ్యయంతో ఇండోర్ స్టేడియం నిర్మించడంతో పాటు క్రీడాకారుల సౌకర్యాలను కల్పించారు. సుమారు రూ. 80 లక్షలతో ఇండోర్ స్టేడియం షెడ్డు నిర్మాణం జరగగా, మరో రూ. 20 లక్షలతో ఇండోర్ స్టేడియం లోపల వుడెన్ ఫ్లోరింగ్ ఏర్పాటు చేశారు. ఒకే సారి రెండు బ్యాచ్‌లు షటిల్ ఆడుకునేలా ఇండోర్ స్టేడియం నిర్మాణం జరిగింది.


కేఎల్‌రావు పార్కులోని ఇండోర్ స్టేడియం


అత్యాధునిక సదుపాయాలతో స్విమ్మింగ్ పూల్

సదుపాయాలు కల్పిస్తున్నాం



డివిజన్‌లో ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నాం... అంతే కాకుండా ప్రజలకు మంచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలనే కేఎల్‌రావు పార్కును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నాం. ఇప్పటికే కొన్ని పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

– మేయర్ భాగ్యలక్ష్మి

రూ. 1.50 కోట్లతో థీమ్ పార్కు....

కేఎల్‌రావు పార్కును థీమ్ పార్కుగా తీర్చి దిద్దేలా మేయర్, 46వ డివిజన్ కార్పొరేటర్ రాయన భాగ్యలక్ష్మి నగర పాలక సంస్థ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పార్కులో వాకింగ్ ట్రాక్‌తో పాటు చిన్నారులు ఆడుకునేందుకు ఆట వస్తువులు, బోటింగ్ కెనాల్‌కు అవసరమైన మరమ్మతులు చేపట్టడం, సందర్శకుల కోసం వాటర్ పొంటేన్లు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే పార్కులో వాకింగ్ ట్రాక్ పూర్తి కాగా, ఆట వస్తువులను ఏర్పాటు చేస్తున్నారు. పశ్చిమ నియోజక వర్గానికే పేరు ప్రఖ్యాతలు వచ్చేలా పార్కును తీర్చిదిద్దాలని అధికారులు కృషి చేస్తున్నారు.

సీఎం జగన్ ప్రభుత్వంలోనే కాపులకు ప్రాధాన్యం



భవానీపురం(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే కాపు సామాజిక వర్గానికి ప్రాధాన్యం లభిస్తుందని వైఎస్సార్ సీపీ కాపు సామాజికవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు తెలిపారు. భవానీపురంలోని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో కాపు నాయకులు మాట్లాడారు. కాపు సామాజికవర్గానికి అత్యంత ప్రాధాన్యత నిస్తున్న సీఎం జగన్ వారి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. అలాగే కాపు సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణకు డెప్యూటీ ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి పదవిని ఇవ్వడం కాపులపై సీఎం జగన్‌కు ఉన్న అభిమానం, ప్రేమకు నిదర్శనమన్నారు. కాపు సామాజిక వర్గీయులకు భవానీపురంలో 480 గజాల స్థలాన్ని కేటాయించడం కోసం కృషి చేసిన పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస రావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు మహదేవు అప్పాజి, యలకల చలపతిరావు, మైలవరపు రత్నకుమారి, మైలవరపు మధురి లావణ్య, అత్తలూరి ఆదిలక్ష్మిలకు ధన్యవాదాలు తెలియ చేశారు. కాపులంతా ఐక్యంగా ఉంటే సాధించలేనిది లేదన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా అండగా ఉండి ఆయన్ని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు.

పథకాల అమల్లో జగనన్న రికార్డు

గడప గడపకు కార్యక్రమంలో ఎంపీ కేశినేని శ్రీనివాస్, షేక్ ఆసిఫ్


42వ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎంపీ కేశినేని నాని, షేక్ ఆసిఫ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సంక్షేమ పథకాల అమలులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రికార్డు సృష్టించారని ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) అన్నారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 42వ డివిజన్‌లో గడప గడపకు మన ఆసిఫ్ సోమవారం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్, కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డితో కలిసి ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) డివిజన్‌లో ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డు, నేతాజీ పబ్లిక్ స్కూల్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. స్థానికులు కేశినేని నాని, ఆసిఫ్‌కు ఘన స్వాగతం పలికారు. ఎక్కడికక్కడ మహిళలు హారతులు ఇచ్చారు. ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ గడప గడప పర్యటనకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని చెప్పారు. ఒక్కో కుటుంబానికి సగటున 4 పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. ఈ రాష్ట్రంలో 1.65 కోట్ల కుటుంబాలకు గాను 1.35 కోట్ల కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా రూ.2.50 లక్షల కోట్లు లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారన్నారు. భారతదేశంలో ఇటువంటి ట్రాక్ రికార్డుగానీ, చరిత్ర గానీ ఏ ముఖ్యమంత్రికి లేదన్నారు. ప్రజలు చాలా సంతృప్తిగా ఉన్నారన్నారు. అభివృద్ధి లేదని ప్రతిపక్షాలు , మీడియా సంస్థలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో అమరావతినే అభివృద్ధి అని చెప్పి తాత్కాలిక భవనాలు నిర్మించారన్నారు. గ్రాఫిక్స్‌లో అమరావతి చూపారని విమర్శించారు.

ప్రశాంత్ కిషోర్ దేవుడు కాదు...

ప్రశాంత్ చెప్పింది చెప్పినట్లు జరగడానికి ఆయనేం దేవుడు కాదని కేశినేని నాని అన్నారు. ఈ మధ్య కాలంలో ఆయన సర్వేలన్నీ విఫలమయ్యాయన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్, రాజస్థాన్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తాయని చెప్పారని, అవేవీ జరగలేదన్నారు. కుటుంబాల్లో చిచ్చులు పెట్టడం బాబుకు వెన్నతో పెట్టిన విద్యన్నారు. సునీత ద్వారా వైఎస్ కుటుంబంలోనూ, తన కుటుంబంలోనూ , ఇతర అనేక కుటుంబాల్లో చిచ్చు పెట్టారన్నారు. చంద్రబాబు చేసే అరాచకల్లో ఇదొకటని పేర్కొన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఆసిఫ్ మాట్లాడుతూ గడప గడపలో తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం ప్రతిపక్షాలకు కనబడడం లేదన్నారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబు కళ్ళులేని కబోదులని విమర్శించారు. కాపులకు పవన్, చంద్రబాబు చేస్తున్న అపకారం చూస్తే చాలా బాధ కలుగుతోందన్నారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఏపీఐఐసీ చైర్మన్ బండి పుణ్యశీల, జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ గౌస్ మొహిద్దీన్, కార్పొరేటర్లు మహాదేవు అప్పాజీ, మరుపిళ్ల రాజేష్, ఇర్ఫాన్, గుడివాడ రాఘవ నరేంద్ర, సిరంశెట్టి పూర్ణచంద్రరావు, మండే పూడి చటర్జీ, భాపతి కోటిరెడ్డి. నాయకులు రాయన నరేంద్ర ,మైలవరపు దుర్గారావు, బాజీ బాబా అమానుల్లా, మజ్జి శ్రీనివాసరావు, ప్రసాద్ రెడ్డి, శివ జయరాంరెడ్డి, చంద్రోఖర్ రెడ్డి, కొరగంజి భాను. సురసాని రాంరెడ్డి, మండల శ్రీనివాసరావు, సలీం, జిలాని, సురేంద్ర పసి, కరీం, కేసరి రాజశేఖర్ రెడ్డి, సాంబిరెడ్డి, ఆత్మరాము,వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి , సరగడ శంకర రెడ్డి, కాశిరెడ్డి, కేసరి చిన్నోడు రోసిరెడ్డి, నయీమ్, సింగ్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు అందజేస్తున్న ఎంపీ నాని, షేక్ ఆసిఫ్

సొంతింటి కల సాకారం చేసిన ఘనత జగనన్నదే

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): రెక్కల కష్టంపై జీవనం సాగించే పేదల చిరకాల కోరికయిన సొంతింటి కలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్ తెలిపారు. స్థానిక 44వ డివిజన్‌లోని 139, 156, 157, 158 సచివాలయాల పరిధిలో పేదలకు ఇచ్చిన స్థలాలకు సంబంధించి 900 పట్టాలకు ఆయా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేశారు. ఈ క్రమంలో వాటిని సోమవారం విద్యాధరపురం లేబర్‌కాలనీలోని వీఎంసీ కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారితో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఆసిఫ్ మాట్లాడుతూ సీఎం జగనన్న తన సుదీర్ఘ పాదయాత్రలో పేదల కష్టాలను తెలుసుకుని మేనిఫెస్టోలో పెట్టిన విధంగా 'నవరత్నాలు – పేదలందకి ఇళ్లు' అనే పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మైలవరపు దుర్గారావు, మండల శ్రీనివాస్, వల్లం రవికుమార్, వీ లీలామధు, ఎ పూర్ణకనకారావు, అంకాని నాగరాజు, ఏజీఎల్ నారాయణ, అక్కపెద్ది శ్రీనివాస్, ఇనపకుర్తి రాము తదితరులు పాల్గొన్నారు.


రిజిస్ట్రేషన్ పట్టాలను పంపిణీ చేస్తున్న ఆసిఫ్, రత్నకుమారి

47వ డివిజన్‌లో 500 పట్టాలకు రిజిస్ట్రేషన్

చిట్టినగర్ 47వ డివిజన్ 151,146,147,148 వార్డ్ సచివాలయాల పరిధిలో 500 మందికి రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను పంపిణీ చేశారు. స్థానిక కార్పొరేటర్ గోదావరి గంగ, బాబుల ఆధ్వర్యంలో కలరా హాస్పటల్ దగ్గర నిర్వహించిన కార్యక్రమంలో పట్టాల పంపణీ జరిగింది. కార్పొరేటర్ గోదావరి గంగ మాట్లాడుతూ తమ డివిజన్‌లో మొత్తం 1500 మంది పేదప్రజలకు ఇళ్ల పట్టాలు మంజూరయ్యాయని, వాటిల్లో తొలి విడతగా 500 పట్టాలను లబ్ధిదారులకు అందచేశామని తెలిపారు. కార్యక్రమంలో రెడపంగు క్రాంతి, సోమిశెట్టి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే స్పందన

నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని చేపట్టిందని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం స్పందన నిర్వహించారు. మొత్తం 12 ఫిర్యాదులను స్వీకరించగా వాటిల్లో ఇంజినీరింగ్ సెక్షన్‌కు సంబంధించి నాలుగు, ఎస్టేట్ విభాగానికి నాలుగు, పట్టణ ప్రణాళిక విభాగానికి ఒకటి, హార్టికల్చర్ ఒకటి, ప్రజారోగ్య శాఖ ఒకటి, యూసీడీ ఒకటి ఉన్నాయి. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వివిధ సమస్యలతో స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు. సమస్యలను దిగువ స్థాయి సిబ్బందికి తెలియచేసినా పరిష్కారం కాకపోతేనే ఇక్కడి వరకు వస్తారని, అటువంటి సమస్యలపట్ల అధికారులు అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఒకసారి ఇక్కడకి వచ్చిన సమస్య నిర్ణీత సమయంలో పరిష్కారం కాకపోతే వారు మళ్లీ వస్తారని, ఆ విధంగా రాకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లోని వివిధ విభాగాల అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. అప్పుడే ప్రజల విశ్వసనీయత, నమ్మకాన్ని చూరగొంటారని పేర్కొన్నారు. సమావేశంలో చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర రావు, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.సత్యవతి, అడిషనల్ కమిషనర్ (జనరల్) ఎ.మహేష్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ పి.రత్నావళి, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, అకౌంట్స్ ఆఫీసర్ నరసింహమూర్తి, ఏడీహెచ్ రత్నకొండ రామమోహన్, బయాలజిస్ట్ సూర్యనాయక్, ఆర్ఎఫ్ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

గణితంపై పట్టుతో ఉద్యోగవకాశాలు

గుణదల (విజయవాడ తూర్పు): గణితశాస్త్రంపై పట్టు సాధించడం ద్వారా విద్యార్థులకు ఉన్నత స్థాయి ఉద్యోగావకాశాలు లభిస్తాయని కర్ణాటక మణిపాల్ విశ్వవిద్యాలయం గణితశాస్త్ర విభాగాధిపతి కుంచెం శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఆంధ్ర లయోల కళాశాలలో గణిత శాస్త్రం పై జాతీయ సదస్సు సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని తెలిపారు. పరీక్షలలో మంచి ప్రతిభ కనబరిచి ఉన్నత ఫలితాలు సాధించాలని సూచించారు. ముఖ్యంగా గణిత శాస్త్రంలో ఎక్కువ మార్కులు సాధించే అవకాశం ఉంటుందన్నారు. సూత్రాలను అవపోసన పట్టి గణిత సమస్యలను సులువుగా పరిష్కరించవచ్చని పేర్కొన్నారు. లయోల కళాశాల కరెస్పాండెంట్ ఫాదర్ సహాయరాజ్, ప్రిన్సిపల్ ఫాదర్ కిషోర్, వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ కిరణ్ కుమార్, గణిత శాస్త్ర విభాగాధిపతి పరుచూరి వేణుగోపాల రావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో నైపుణ్యం కలిగి ఉండాలి..

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను పెంపొందించే దిశగా సాంస్కృతిక కార్యక్రమాలు దోహదపడతాయని లయోల కళాశాల విజువల్ కమ్యూనికేషన్ విభాగాధిపతి ఫాదర్ రాయప్ప అన్నారు. గ్రాస్ కినోస్ 2.0 పేరుతో కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమం సోమవారం లయోల కళాశాలలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఫాదర్ రాయప్ప మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు.
విద్య, క్రీడలు, లలిత కళలు, సామాజిక సేవ వంటి రంగాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు గ్రూప్ డ్యాన్స్, ర్యాంప్ వాకింగ్, సోలో సింగింగ్ వంటి అంశాల్లో పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ ప్రభుదాస్, ఫాదర్ కిరణ్, అధ్యాపకులు శ్రీధర్, కార్తీక్, లలిత తదితరులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ శ్యామ్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

వివాహితకు వేధింపులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తిపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. కోమల విలాస్ సెంటర్‌కు చెందిన జోడు స్వప్న భర్త కృష్ణారావు రెండేళ్ల కిందట భార్య, పిల్లలను వదిలి వెళ్లిపోయాడు. స్వప్నకు కొంతకాలంగా తణుకు శివకుమార్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. శివకుమార్ అవసరాల కోసం తెలిసిన వారి వద్ద స్వప్న అప్పు ఇప్పించింది. ఇటీవల శివకుమార్, స్వప్నను మరి కొంత అప్పు ఇప్పించని వేధింపులకు గురి చేయసాగాడు. స్వప్న పని చేసే షాపు వద్దకు వెళ్లి చంపుతానని బెదిరింపులకు పాల్పడసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

భద్రత జీవన విధానంలో భాగం కావాలి



ఇబ్రహీంపట్నం: భద్రత అనేది మన జీవన విధానంలో ఒక భాగం కావాలని ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ నవీన్ గౌతమ్ అన్నారు. సంస్థలో 53వ జాతీయ భద్రతా వారోత్సవాలను ఆయన సోమవారం ప్రారంభించారు. పరిశ్రమల్లో 85 శాతం ప్రమాదాలు ప్రమాదకర చర్యలు, మానవ తప్పిదాల వలన జరుగుతున్నాయని తెలిపారు. రక్షణ సామగ్రి, యూనిఫాం ధరించాలని అన్నారు. ఏకాగ్రతతో పూర్తిస్థాయిలో ప్రమాదాల నివారణకు పాటుపడాలని సూచించారు. సంస్థలో ప్రమాదాలు జీరో స్థాయికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న యువకుడి అరెస్టు

చిట్టినగర్:అక్రమంగా బీరు, మద్యంను విక్రయిస్తున్న యువకుడిని కొత్తపేట పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వించిపేట రైల్వే ఆప్ యార్డు సమీపంలో ఓ యువకుడు అనుమానాస్పదంగా సంచరిస్తున్నాడు. సెక్టార్ ఎస్ఐ రాజనరేంద్ర గుర్తించి యువకుడిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఆ యువకుడు కేఎల్‌రావునగర్ వీఎంసీ కాలనీకి చెందిన కుప్పాల ఠాగూర్ కుమార్‌గా గుర్తించారు. ఠాగూర్ కుమార్ చిట్టినగర్‌లోని పలు బార్ అండ్ రెస్టారెంట్ల నుంచి మద్యం, బీర్ బాటిల్స్‌ను కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తునట్లు గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి 10 బీర్ బాటిల్స్, 6 క్వార్టర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):జిల్లాలోని నిరుద్యోగ యువతకు మార్చి 7 తేదీ నుంచి స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. కటింగ్ టైలరింగ్, డ్రెస్ డిజైనింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మిర్రర్ వర్క్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, మెషిన్ ఎంబ్రాయిడరీ, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ఏసీ, రిఫ్రిజరేటర్ మెకానిజం, ఐస్‌క్రీమ్ మేకింగ్, స్క్రీన్ ప్రింటింగ్, జామ్ అండ్ జ్యూస్ తయారీ, భాతిక్ ప్రింటింగ్, హోమ్ క్రాఫ్ట్స్ మేకింగ్, మిర్రర్ వర్క్ కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని వివరించారు.
ఆసక్తి ఉన్న వారు మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కానీ 0866–2470420 నంబరులో కానీ సంప్రదించాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ వెస్ట్ :
90102 10386
Office mail : sakshiads@gmail.com